తెలుగు డిజిటల్ పత్రిక

# వేద

(టీ మీడియా అనుబంధం)

అక్షరం ఆయుధం, వార్తే మార్గం

నిజం నిష్పక్షపాతం | సమాజం కోసం | 24/7 వార్తలు | డిజిటల్ యుగం | సత్యం మా లక్ష్యం

సోమవారం | 27 సెప్టెంబర్ 2026 | www.tmedia.net.in



## డిగ్రీ ఆచార్యుల భర్తీపై రచ్చ.. మెరిట్ అభ్యర్థులకు మార్కుల ముప్పు

**కొలువుల భర్తీకి మార్కుల మెలిక.. అకడమిక్ మార్కులకు వెయిటేజీ, ఇంటర్వ్యూల పునరుద్ధరణతో జీవో 4 పై అభ్యంతరాలు**

**హైదరాబాద్/అమరావతి, సెప్టెంబర్ 26:** ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ సన్నాహాలు చేస్తున్నది. త్వరలో నోటిఫికేషన్ విడుదలకానుంది. గతంలో జారీ అయిన 514 పోస్టులతో పాటు మరో వెయ్యి పోస్టులు అదనంగా చేర్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కొత్త విధానంలో యూజీ, పీజీ మార్కులకు వెయిటేజీ ఇవ్వడంపై నిరుద్యోగ అభ్యర్థులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. వర్సిటీల మధ్య మార్కుల శాతం భారీగా మారుతూ ఉండటంతో మెరిట్ అభ్యర్థులకు నష్టం కలగవచ్చని వారు పేర్కొంటున్నారు.



కొన్ని ప్రైవేట్, డీమ్డ్, అటానమస్ సంస్థల్లో అధిక మార్కులు, ఇతర విశ్వవిద్యాలయాల్లో తక్కువ మార్కులు నమోదవుతున్నాయని అభ్యర్థులు చెబుతున్నారు. పీహెచ్‌డీ అర్హతల విషయంలోనూ వర్సిటీల నాణ్యతను పరిగణనలోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. జీవో 4ను రద్దు చేసి జీవో 6 ఆధారంగా పోస్టులు భర్తీ చేయాలని అధ్యాపక సంఘాల నేతలు, నెట్, జేఆర్ఎఫ్ అభ్యర్థులు కోరుతున్నారు.

## హైకోర్టులో ఉద్యోగాలు.. లా చదివినోళ్లకు అవకాశం

**సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పోస్టులకు నోటిఫికేషన్.. అక్టోబర్ 01 వరకు దరఖాస్తులు**




**అమరావతి, సెప్టెంబర్ 26:** అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జుడీషియల్ సర్వీస్‌లో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కేడర్ అధికారుల నుంచి లిమిటెడ్ డిపార్ట్‌మెంటల్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ద్వారా ఓపెన్ కేటగరీలో సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. మొత్తం 16 పోస్టులు ఉన్నాయి. అర్హులైన అధికారులు 2026 మార్చి 31 నాటికి కనీసం మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసి ఉండాలి. ఎంపికైన వారికి నెలకు రూ.1,11,000 నుంచి రూ.1,63,030 వరకు జీతం ఉంటుంది. దరఖాస్తులను సంబంధిత ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జి కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో సమర్పించాలి. ఓసీ, ఈడబ్ల్యూఎస్, బీసీ అభ్యర్థులకు రూ.1,000; ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు రూ.500 ఫీజు. ఎంపికలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష, మూడు పేపర్ల రాత పరీక్ష, మౌఖిక పరీక్ష ఉంటాయి.

**చివరి తేదీ:** అక్టోబర్ 01, 2026.

**అధికారిక వెబ్‌సైట్:** aphc.gov.in/recruitments.php

## హోంగార్డులకు శుభవార్త.. పోలీస్ డ్రైవర్ కానిస్టేబుల్ పోస్టుల్లో 10% రిజర్వేషన్

**ఏపీ ప్రభుత్వం ప్రత్యేక రిజర్వేషన్ విధానంలో మార్పు**

**అమరావతి, సెప్టెంబర్ 26:** రాష్ట్ర పోలీస్ శాఖలో హోంగార్డులుగా పనిచేస్తున్న వారికి ఏపీ ప్రభుత్వం ప్రత్యేక రిజర్వేషన్ కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా భర్తీ చేసే పోలీస్ స్టైపెండరీ ట్రైనీ కానిస్టేబుల్ ఉద్యోగాల్లో హోంగార్డులకు 10 శాతం ప్రత్యేక రిజర్వేషన్ కల్పించేలా నిబంధనలను సవరించింది. పోలీస్ డ్రైవర్ కానిస్టేబుల్ పోస్టుల్లో ప్రతి 100 పోస్టుల్లో 10 పోస్టులు అర్హులైన హోంగార్డులకు కేటాయించనున్నట్లు తెలిపింది. మిగతా ప్రత్యేక కేటగరీల రిజర్వేషన్లలో మార్పులు లేవని ప్రభుత్వం పేర్కొంది. సవరించిన విధానం రాబోయే పోలీస్ డ్రైవర్ రిక్రూట్‌మెంట్‌లలో అమలు కానుంది.

